సాక్షి ఖమ్మం

సోమవారం । 12 । ఆగస్టు । 2024



కళారంగానికి వెన్నుదన్ను..

కళారంగానికి తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 8లో



ట్రయల్ రన్ సక్సెస్

ములకలపల్లి మండలంలో సీతారామ పంప్‌హౌస్ - 2 ట్రయల్‌రన్‌ను మంత్రులు ప్రారంభించగా విజయవంతమైంది. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 24°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఎండ ప్రభావం ఉంటుంది. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎంపీ పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పర్యాటక, సాంస్కృతిక శాఖ, ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సోమవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. తొలుత ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని బౌద్ధ స్తూపం, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. ఆతర్వాత ఖమ్మం ఖిల్లాను సందర్శించి రోప్ వే ఏర్పాటుపై సమీక్షిస్తారు. అనంతరం వైరా రిజర్వాయర్‌ను సందర్శించనున్న డిప్యూటీ సీఎం, మంత్రులు పర్యాటకంగా అభివృద్ధికి సాధ్యాసాధ్యాలపై చర్చిస్తారు. అక్కడి నుంచి భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్ వద్దకు చేరుకుని బడ్జెట్ హోటల్, టూరిజం హోటల్ నిర్మాణం, బోటింగ్‌ను పరిశీలించనున్నారు.

ఖిల్లా, బౌద్ధారామం అభివృద్ధికి ప్రతిపాదనలు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: అభివృద్ధిలో జిల్లాను రాష్ట్రంలోనే ముందంజలో నిలిపేలా కృషిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మం ఖిల్లాకు పూర్వవైభవం వచ్చేలా పనులు చేపడుతామని తెలిపారు. విద్యుద్దీపాలతో అలంకరించడంతో పాటు రోప్ వే, వ్యూ పాయింట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని చెప్పారు. అంతేకాక నేలకొండపల్లి మండలంలోని బౌద్ధారామం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దదైన ఈ క్షేత్రం సుందరీకరణకు కృషి జరుగుతోందని, విద్యుత్ దీపాలంకరణ, సుందరీకరణ, పరిరక్షణతో పాటు బాలసముద్రం బోటింగ్ ఏర్పాటు పనులు త్వరలో మొదలు కానున్నాయని మంత్రి ఓ ప్రకటనలో వెల్లడించారు.

నృసింహుడికి పవిత్ర ధారణ



ప్రత్యేక అలంకరణలో స్వామి

ఖమ్మం గాంధీచౌక్: ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారికి శాస్త్రోక్తంగా పవిత్ర ధారణ చేశారు. ఆతర్వాత అర్చకులు విశేష పూజలు, హోమాలు నిర్వహించగా ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు పర్యవేక్షించారు.

రేపు తెలంగాణ మజ్దూర్ యూనియన్ సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఖమ్మం రీజియన్ మహాసభ ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకుడు గుర్రం శ్రీనివాస్ తెలిపారు. ఖమ్మంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగే సభలో కార్మికుల సమస్యలపై చర్చించడంతో పాటు భవిష్యత్ ప్రణాళిక రూపొందిస్తామని పేర్కొన్నారు. యూనియన్ వ్యవస్థాపక కార్యదర్శి అశ్వత్థామ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఈ సభకు ఉద్యోగ, కార్మికులు హాజరుకావాలని కోరారు. సన్నాహక సమావేశంలో నాయకులు చిత్రాల శ్రీనివాసరావు, నిమ్మటూరి సత్యం, మెరుగు రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లుకు నియామకపత్రం ఇస్తున్న ఎన్నికల అధికారులు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కురవగడ్డ వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. ఈ మేరకు ఎండీ జహంగీర్, యు.వెంకటయ్య, ఎండీ సాబీబ్, ఇబ్రహీం ఎన్నికల అధికారులుగా వ్యవహరించగా వెంకటేశ్వర్లు, బి.రామారావు గౌడ్ నామినేషన్లు వేశారు. అయితే, పరిశీలన జరిపిన అనంతరం రామారావు నామినేషన్‌ను తిరస్కరించడంతో వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. మూడేళ్ల పాటు పదవిలో కొనసాగనున్న ఆయన్ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో బి.రామారావు, దాసరి వేణుగోపాల్, ఎల్.గంగన్న, జి.రాములు, ప్రసాద్, బానోత్ హరిసింగ్, జి.నాగరాజు, వనమా శ్రీనివాసరావు, రాఘవులు, వి.నాగరాజు, భిక్షం, హుస్సేన్ పాల్గొన్నారు.

పర్యాటకానికి ఊపు!



పులిగుండాల ప్రాజెక్టు వ్యూ

తాజా బడ్జెట్‌లో ఎకో టూరిజంకు నిధులు

- జిల్లాలో కళ సంతరించుకోనున్న 'కనకగిరి' సర్క్యూట్
- ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదం పంచనున్న అటవీ ప్రాంతం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మందికి ఉపాధి
- నేడు జిల్లాలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి జిల్లాలో ఉన్న అటవీ ప్రాంతం, వన్యప్రాణులను కాపాడడమే కాక ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదాన్ని పంచేలా రాష్ట్రప్రభుత్వం ఎకో టూరిజం(పర్యావరణ పర్యాటకం)పై దృష్టి సారించింది. ఈనేపథ్యాన వందలాది మంది గ్రామీణ యువతకు ఉపాధి లభిస్తుందని భావిస్తున్నారు. కొన్నాళ్ల క్రితం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వాన జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ఉన్న అవకాశాలపై డీపీఆర్ సమర్పించారు. ఈమేరకు కనకగిరి అడవుల్లో ఎకో టూరిజం అభివృద్ధికి నిర్ణయించిన ప్రభుత్వం.. తాజా బడ్జెట్‌లో నిధులు సైతం కేటాయించారు. ఇక సోమవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా పర్యటనలో భాగంగా నేలకొండపల్లిలోని బౌద్ధస్తూపం, ఖమ్మం ఖిల్లాను సందర్శిస్తారు. ఇదే సమయంలో కనకగిరి ఎకో టూరిజం పైనా సమీక్షించే అవకాశముంది.

14వేల హెక్టార్లలో కనకగిరి సర్క్యూట్

కొండలు, పక్షుల కిలకిలారావాలు, కనుచూపు మేరలో పచ్చదనంతో కనకగిరి అడవులు విస్తరించి ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఏన్కూరు, కల్లూరు, చంద్రుగొండ, జూలూరుపాడు, సుజాతనగర్ మండలాలతో పాటు సత్తుపల్లి అటవీ డివిజన్ తల్లాడ రేంజ్ పరిధి పెనుబల్లి మండలం బ్రహ్మలకుంట సమీపం వరకు 14వేల హెక్టార్లలో ఈ అడవి ఉంటుంది. ఇందులో 51ఎకరాల విస్తీర్ణం కలిగిన ఉన్న పులిగుండాల ప్రాజెక్టు సాగునీటి అవసరాలను తీర్చడమే కాకుండా అటవీప్రాంతంలోని వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ఉపకరిస్తోంది. కొండల మధ్య ఉండే ఈ ప్రాజెక్టు పర్యాటకులను సైతం ఆకట్టుకుంటోంది.

ప్రకృతి ప్రేమికులకు వరమే..

పులిగుండాల ప్రాజెక్టులో పర్యాటకులకు బోటింగ్ సదుపాయం, అక్కడకు చేరుకునేలా ట్రెక్కింగ్ అందుబాటులోకి రానుంది. ఆపై వాచ్‌టవర్, పక్షులను వీక్షించేందుకు ఏర్పాట్లు, సఫారీపై విహార యాత్ర, పర్యాటకుల సౌకర్యార్థం రోడ్డు సదుపాయం కల్పిస్తారు. అంతేకాక సోలార్ విద్యుత్, కాటేజీల నిర్మాణంతో ప్రకృతి ప్రేమికులు ఇక్కడ విడిది చేసే అవకాశం లభిస్తుంది.

ఎకో టూరిజంతో ఆదాయ మార్గాలు

జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధితో ఆదాయం పెరగనుంది. ఖమ్మం, విజయవాడ, కొత్తగూడెం, భద్రాచలం, సత్తుపల్లికి కనకగిరి అడవులు దగ్గరలో ఉంటాయి. ఆయా జిల్లాల్లో ఎకో టూరిజం లేకపోవడంతో ప్రకృతి, పర్యావరణ ప్రేమికులు కనకగిరి అడవుల బాట పడతారు. ప్రకృతి ఒడిలో సేద దీరేందుకు పర్యాటకులు రానుండడంతో ఈ మార్గంలో ప్రైవేట్ రంగంలోనూ హోటళ్లు, విడిది కేంద్రాలు ఏర్పాటయ్యే అవకాశముంది.

అడవి, అటవీ జాతులకు మేలు



పర్యాటక ప్రాంతాలను త్వరగా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం. కనకగిరి అడవుల్లో చూడవలసిన ప్రదేశాలెన్నో ఉన్నాయి. ఎకో టూరిజం అభివృద్ధితో ఆదాయం పెరగడమే కాక స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఫలితంగా అడవికి, జంతుజాతులకు సైతం మేలు జరుగుతుంది. ఇప్పటికే జంతువులకు ఎవరూ హానీ చేయకుండా సీసీ కెమెరాలు, వాచ్ టవర్ల ద్వారా పర్యవేక్షిస్తున్నాం. పర్యాటక అభివృద్ధి జరిగాక నిఘా మరింత పెరుగుతుంది.

– సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, జిల్లా అటవీ శాఖాధికారి

ఏమేం చేస్తారంటే...

కనకగిరి కొండలపై కాకతీయుల హయాంలో నిర్మించిన వీరభద్రస్వామి ఆలయం, శివాలయాలను ఎకో టూరిజం కింద అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా ప్రభుత్వం సమాయత్తమవుతోంది. అంతేకాకుండా కల్లూరు సమీపాన కాకతీయుల కాలంలో నిర్మించిన పల్లెర్ల బావి, పాత ఖిల్లా, కనకగిరి కొండపై లియోపర్డ్ వాచ్‌టవర్లను అభివృద్ధి చేస్తారు. పలుచోట్ల వ్యూ పాయింట్లు ఏర్పాటుచేసి కనకగిరి కొండల అందాలను వీక్షించేలా చూస్తారు. ఏడాది పొడవునా నీరు ఉండే పల్లెర్ల బావితో పాటు పల్లెర్ల వీరభద్రస్వామి ఆలయాన్ని కూడా ఎకో టూరిజంలో భాగంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఆపై కనకగిరి హిల్స్‌పైకి సులువుగా వెళ్లేలా తిరుమల కొండ మాదిరి ఘాట్ రోడ్డు నిర్మిస్తారు. అలాగే, జంగిల్ సఫారీ వాహనం ఏర్పాటు చేసి స్థానిక గిరిజన తెగల్లో శిక్షణ పొందిన డ్రైవర్లను ఎంపిక చేస్తారు. పులిగుండాల వాటర్‌ఫాల్స్‌కు ట్రెకింగ్ చేస్తూ వెళ్లేలా అవగాహన కల్పిస్తారు. ఫలితంగా పర్యాటకుల రాక పెరిగి స్థానిక యువత, ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

సాగునీటి రంగాన్ని విధ్వంసం చేశారు..



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన మరో మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే రాందాస్ తదితరులు

- రూ.8వేల కోట్లు వెచ్చించి ఎకరాకూ నీళ్లు ఇవ్వలేదు
- ఇప్పుడు రాజీవ్ కెనాల్‌తో 1.75 లక్షల ఎకరాలు సాగులోకి..
- 2026 ఆగస్టు నాటికి 'సీతారామ' పూర్తి
- రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సభామైదానం మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రులు

వైరా: ఉమ్మడి జిల్లా ప్రజల కలల ప్రాజెక్టు అయిన 'సీతారామ'ను దివంగత సీఎం డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో భాగంగా రూ.2 వేల కోట్ల అంచనాలతో ప్రారంభించారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. అయితే, బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక అంచనాలు పెంచినా ఒక్క ఎకరాకూ నీరు ఇవ్వకపోగా సాగునీటి రంగాన్ని విధ్వంసం చేశారని మండిపడ్డారు. వైరాలో ఈనెల 15న జరగనున్న సీఎం రేవంత్‌రెడ్డి సభ ఏర్పాట్లను రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ వైఎస్ హయాంలో రూపొందించిన ప్రాజెక్టు అంచనాలను గత ప్రభుత్వం రీడిజైన్ పేరుతో రూ.18 వేల కోట్లు పెంచి రూ.8 వేల కోట్లు వెచ్చించినా ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదని తెలిపారు. అయితే, తాము అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వాన కేబినెట్‌లో చర్చించి సీతారామ ప్రాజెక్టు నీటిని రాజీవ్ కెనాల్ ద్వారా ఉమ్మడి జిల్లాలో సుమారు 1.75 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. రానున్న రెండేళ్లలో సీతారామ ప్రాజెక్టు పూర్తిచేశామని చెప్పారు. కాగా, గత ప్రభుత్వం కనీసం గోదావరి నీటి కేటాయింపులు కూడా చేపట్టకుండా పనులు ప్రారంభించిస్తే తాము ఆరు నెలల్లోనే 67 టీఎంసీల కేటాయింపునకు కేంద్రంతో ఆమోదం చేయించామని తెలిపారు. ఈనెల 15వ సీతారామ పంప్‌హౌస్‌ల నుంచి నీరు విడుదల చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి అదేరోజు వైరాలో జరిగే సభలో రూ.2లక్షల రుణమాఫీ చెక్కులు అందిస్తారని చెప్పారు. అలాగే, ధరణి చట్టం స్థానంలో మెరుగైన చట్టాన్ని తీసుకురానుండగా, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని, త్వరలోనే కొత్త రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేస్తామని పొంగులేటి వెల్లడించారు.

పంద్రాగస్టు చరిత్రాత్మకం

సీఎం రేవంత్‌రెడ్డి వైరా పర్యటన సందర్భంగా ఈనెల 15వ తేదీ ప్రజలకు చరిత్రాత్మకంగా నిలిచిపోనుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. అదేరోజు గోదావరి జలాలు విడుదల చేయడమేకాక రూ.2 లక్షల రుణమాఫీ చేస్తారని చెప్పారు. సీతారామ ప్రాజెక్టును తమ కీలకంగా భావిస్తున్నామని తెలిపారు. ప్రాజెక్టు ప్రధాన 14వ కి.మీ. వరకు 1 నుండి 8వ ప్యాకేజీల్లో పనులు పూర్తికాగా.. 9.85 కి.మీ. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా పినపాక నియోజకవర్గంలో 15,795 ఎకరాలకు సాగు నీరు అందుతుందని చెప్పారు. తొలుత మంత్రులు వైరా శాంతినగర్‌లో సభావేదిక, హెలీప్యాడ్ నిర్మాణ పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌తో పాటు నాయకులు, ప్రజాప్రతినిధులు బొర్రా రాజశేఖర్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, దార్నా రాజశేఖర్, పణితి శ్రీను, పమ్మి అశోక్, కట్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలా పెదవాగు ప్రాజెక్ట్



ప్రస్తుతం నీటి కుంటను తలపిస్తున్న ప్రాజెక్ట్



జలకళతో పెదవాగు ప్రాజెక్ట్ (ఫైల్)

అన్నదాతల జీవనాడి.. పంట పొలాలకు సాగునీరు అందించే పెదవాగు ప్రాజెక్ట్ నీటి కుంటలా మారిపోయింది. గత నెల 18న రాత్రి కురిసిన భారీ వర్షాలు, వరదలతో అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద గల ప్రాజెక్ట్ కట్టకు భారీ గండ్లు పడిన సంగతి తెలిసిందే. దీంతో సాగునీరంతా గోదావరి పాలై ప్రాజెక్టు ఖాళీగా దర్శనమిస్తోంది. జలాశయంలో పడమర దిక్కులో గుంత ఉండగా, దాంట్లో కొద్దిపాటి వరదనీరు నిలిచి నీటి కుంటలా మారిపోయింది. ఆదివారం కనిపించిన దృశ్యమిది.

–అశ్వారావుపేటరూరల్

ఆటాడుకుందాం.. రా

- ప్రభుత్వ పాఠశాలల్లో వారానికి మూడు రోజులు క్రీడలు
- ప్రతీ శనివారం డ్రిల్ చేసేలా ఏర్పాట్లు



ఖమ్మం స్పోర్ట్స్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను చదువులో తీర్చిదిద్దుతూనే క్రీడల్లో సైతం తర్ఫీదునిచ్చేలా రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వ్యాయామ విద్య కార్యకలాపాలను విస్తృతం చేసేలా ఇప్పటికే ఒక కమిటీని వేసి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటివరకు ఆసక్తి ఉన్న కొందరు పీఈటీలు, పీడీలు మాత్రమే విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దుతున్నారు. దీంతో కొన్ని పాఠశాలల నుంచే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారు. ఇకపై అలాకాకుండా అన్ని పాఠశాలల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులకు క్రీడాంశాల్లో శిక్షణ ఇప్పించాలని విద్యాశాఖ భావిస్తున్నట్లు తెలిసింది.

ప్రత్యేక పీరియడ్

జిల్లాపరిషత్, ఉన్నత పాఠశాలల్లోనే ఇన్నాళ్ల పీఈటీలు, పీడీలు ఉన్నారు. అయితే, అర్హులైన వేలాది మంది ఉన్నందున ప్రాథమిక పాఠశాలల్లోనూ పీఈటీలను నియమించాలని నిరుద్యోగుల నుంచి డిమాండ్ వస్తోంది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం పీఈటీ పోస్టుల భర్తీకి కసరత్తు మొదలుపెట్టినట్లు సమాచారం. కాగా, కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో వారం ఒక రోజు క్రీడలకు సంబంధించిన పీరియడ్ నిర్వహించడంతో పాటు డ్రిల్ నేర్పిస్తారు. ఇకపై ప్రభుత్వ స్కూళ్లలోనూ విద్యార్థులకు వారానికి మూడు రోజులు క్రీడాశిక్షణ ఇవ్వాలని, ప్రతీ శనివారం డ్రిల్ చేయించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి త్వరలో కార్యాచరణ మొదలవుతుందని సమాచారం. ఈ అంశంపై పలువురు పీఈటీ, పీడీలు స్పందిస్తూ విద్యార్థులను క్రీడాంశాల్లో తీర్చిదిద్దేందుకు సిద్ధమేనని చెబుతున్నారు. నూతన విధానం అమల్లోకి వస్తే పాఠశాలల స్థాయి నుంచే మెరుగైన క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశముందనే భావన వ్యక్తమవుతోంది.

26 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణ



ఆవిష్కరించిన జాతీయ పతాకం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధి రుద్రంపూర్‌లో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లోని వజ్రాల గుట్టపై 26 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ నెల 15న స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మోహన్ రెడ్డి, చిలక రాజయ్య, గౌతమ్, అనూక్ రాజ్, డాక్టర్ రాము, ఈశ్వర్, కుమార్, ఆరే నాగభూషణం, రాహుల్, అముదాల శివ, బండ వెంకట్, శివ, టైలర్ చోటి, రామ్ సందీప్, దీపు, విశాల్, సాగర్, జునైద్, దినేష్, చందు, లడ్డు, మణికంఠ, రంజీత్, శశాంక్, వికాస్, కోరి తదితరులు పాల్గొన్నారు.

అలా వస్తే పని ఐపోయినట్లే!

- రవాణా శాఖలో ఏజెంట్లదే హవా
- వారిని కలిసొస్తేనే కార్యాలయాల్లో పనులు
- సేవలన్నీ ఆన్‌లైన్ చేసినా ఆగని దందా

ఖమ్మంక్రైం: ఏళ్లుగా రవాణా శాఖలో ఏజెంట్ల హవా కొనసాగుతోంది. ఈ శాఖలో ఏ పని కావాలన్నా వీరిని కలిస్తే అయిపోతుందనే భావన సామాన్యుల్లోనూ బలపడింది. ఇదంతా అనాదిగా సాగుతుండడంతో ఏజెంట్ల జోక్యాన్ని అరికట్టడం, అవినీతిని రూపుమాపేందుకు 32 రకాల సేవలను ఆన్‌లైన్ చేశారు. అయినప్పటికీ ఏజెంట్ల దందా ఆగడం లేదు. గతంలో ఎలాగైతే వారు ముఖ్యపాత్ర పోషించారో ఇప్పుడు అదే పరిస్థితి కొనసాగుతోంది. రవాణశాఖ ఉద్యోగులు, ఏజెంట్ల మధ్య అవగాహనతో ఈ దందా మూడు పూవులు.. ఆరుకాయలుగా సాగుతుందనే విమర్శలున్నాయి. ఏజెంట్ల వ్యవస్థకే గుర్తింపు లేదని ప్రభుత్వం చెబుతున్నా... వారు కార్యాలయంలోకి యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తూ తాము చెప్పిన వారి పని మొదటగా చేయాలని శాసించే స్థాయికి ఎదగడం గమనార్హం.

నిమిషాల్లో పనులు పూర్తి

జిల్లాలో ఖమ్మంతోపాటు వైరా, సత్తుపల్లిలో రవాణశాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడ లెర్నింగ్, పర్మనెంట్ లైసెన్సుల జారీ, రిజిస్ట్రేషన్, వాహన పర్మిట్లు తదితర సేవలు అందుతాయి. అయితే, రవాణా శాఖ కార్యాలయానికి ఎవరైనా నేరుగా వెళ్తే మాత్రం నిరాశే ఎదురవుతుంది. ఎన్నిసార్లు స్లాట్ బుక్ చేసుకున్నా సమయానికి సేవలు అందే పరిస్థితి ఉండదు. ఫలితంగా వాహనదారులు రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ ఉండే ఏజెంట్లను సంప్రదిస్తే నిమిషాల్లో పని పూర్తవుతోంది. గతంలో గంటల తరబడి నిల్చున్నా కాని పని చకచకా అయిపోతుండడంతో చేసేదేం లేక పలువురు డబ్బు ఖర్చయినా సరేనంటూ అడ్డదారిలో వెళ్తున్నారు.

- ఓ వ్యక్తి కారు కొనుగోలు చేసి ఖమ్మం ఆర్‌టీఏ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ కోసం వెళ్లాడు. కార్యాలయ ఆవరణలో పెయింట్ డబ్బాలు, స్టిక్కర్లతో ఎదురైన కొందరు స్టిక్కర్ వేయించుకోవాలని చెప్పారు. అవసరం లేదంటూ యజమాని ముందుకు వెళ్లే సరికి ఛాసిస్ నంబర్ నమోదుకు స్టీరింగ్ దగ్గర ఉన్న మ్యాట్ తీయించాలని సిబ్బంది సూచించారు. కట్టర్ లేకపోవడంతో యజమాని ఆలోచిస్తుండగానే తొలుత కలిసిన వారు కట్టర్‌తో మ్యాట్ తీయడమే కాక వెనుకాల అర మీటర్ కూడా లేని స్టిక్కర్ వేసి రూ.100 వసూలు చేశారు
- ఒకరి లైసెన్స్ గడువు ముగియగా.. రెన్యువల్ కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయానికి వెళ్తే సవాలక్ష చిక్కులు ఎదురయ్యాయి. ఇంకో మిత్రుడి సలహాలతో కార్యాలయం సమీపాన ఉన్న ఏజెంట్‌ను సంప్రదించగానే చకచకా ఫారాలు నింపి.. కాస్త భారీగానే డబ్బు తీసుకుని కార్యాలయంలోకి పంపించాడు. దరఖాస్తుపై 'మార్క్' ఉండడంతో కౌంటర్‌లో వెనువెంటనే ఫొటో తీసి పంపించేశారు.



ఖమ్మంలోని ఆర్టీఏ కార్యాలయం



ఆర్టీఏ కార్యాలయం సమీపాన ఏజెంట్ల కార్యాలయాలు

పరస్పర అవగాహన

రవాణా శాఖ కార్యాలయాల్లోని సిబ్బంది పాతవారైనా, కొత్తవారైనా ఏజెంట్లతో అవగాహన కుదుర్చుకోవాల్సిందేనని తెలుస్తోంది. సిబ్బంది మొదలు అధికారుల వరకు ఎవరొచ్చినా ఏజెంట్లు వారి చేతులు తడిపేందుకు వాహనదారుల జేబులకు చిల్లు పెడుతున్నారు. ఆర్టీఏ కార్యాలయం చుట్టుపక్కలే ఏజెంట్ల కార్యాలయాలు ఉండగా.. ఆఫీస్ ఆవరణ, ఉద్యోగుల క్యాబిన్లలోకి సైతం యథేచ్ఛగా వారు వచ్చివెళ్తుంటారు. ఖమ్మం ఆర్టీఏ ఆఫీస్ సమీపాన 50 నుంచి 70 మంది, వైరాలో 20 మంది, సత్తుపల్లిలో 25 మంది వరకు ఏజెంట్లు ఉంటారని అంచనా. వీరి దందాపై ఆరోపణలు తీవ్రంగా రావడంతో రెండేళ్ల క్రితం కార్యాలయాలపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి ఏజెంట్లను దూరం చేయాలని హెచ్చరించారు. కొన్నాళ్లు అంతా బాగుందని అనిపించినా ఆ తర్వాత పరిస్థితి మొదటికి వచ్చింది.

అర్హతలేని వైద్యులతో సర్టిఫికెట్లు

లైసెన్స్ రెన్యువల్ తదితర కొన్ని సేవలకు గాను వాహనదారుడు అర్హత కలిగిన(ఎంబీబీఎస్ స్థాయి) వైద్యుడి నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించాలి. ఈ సర్టిఫికెట్‌ను వాహనదారులు తీసుకోవడం కాస్త కష్టమేనని చెప్పాలి. కానీ ఏజెంట్లు మాత్రం నిమిషాల్లో రూ.200 నుంచి రూ.500 వరకు తీసుకుని సర్టిఫికెట్లు ఇప్పిస్తారని తెలుస్తోంది. పలువురు ఏజెంట్ల వద్ద అర్హత లేని వైద్యుల పేరిట ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు సిద్ధంగా ఉంటాయని సమాచారం. ఈ తంతు ఏళ్లుగా సాగుతున్నా సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యుడెవరో ఆరా తీసే పరిస్థితి రవాణా శాఖలో లేకపోవడం గమనార్హం.

ఏజెంట్లు అడుగుపెట్టకుండా చర్యలు

జిల్లాలోని రవాణా శాఖ కార్యాలయాల్లోకి ఏజెంట్లు అడుగు పెట్టకుండా చూస్తున్నాం. ఎవరైనా లోపలకు వచ్చినా బయటకు పంపించాలని సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. వాహనదారులు స్లాట్ బుక్ చేసుకుని నిర్దేశిత రుసుము చెల్లించి నేరుగా మా కార్యాలయాలకు వచ్చి అవసరమైన సేవలు పొందొచ్చు.

– వెంకటరమణ, ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ, ఖమ్మం

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి చిత్రకూట మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

క్లుప్తంగా

ఖమ్మం వాసికి అయ్యప్ప సేవారత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అప్పారావు

ఖమ్మంఅర్బన్: తమిళనాడులోని కాంచీపురంలో ఆదివారం నిర్వహించిన అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ సమావేశంలో దక్షిణ భారతదేశానికి 18 మంది గురుస్వాములకు అయ్యప్ప సేవారత్న పురస్కారాలు అందించారు. ఇందులో తెలంగాణ నుంచి నలుగురు ఉండగా ఖమ్మం శ్రీశాస్త దేవస్థానం ట్రస్ట్ సభ్యుడు తుమ్మలూరి అప్పారావుకు సైతం పురస్కారం దక్కింది. వీరికి ఏబీఏపీ ఫౌండర్ అండ్ మేనేజింగ్ ట్రస్టీ పీ.ఎస్.కే.మీనన్ తదితరులు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యాక్రమంలో ప్రచార సభ బాధ్యులు కె.అయ్యప్పదాసు, బేతి తిరుమలరావు, బెల్లపు హరిప్రసాద్, పార్థసారధి, టీ.వీ.పుల్లంరాజు, కర్కా సిద్దు, మూడా శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధస్తూపం అభివృద్ధికి అడుగులు పడేనా?



బౌద్ధ స్తూపం

నేలకొండపల్లి: దక్షిణ భారతదేశంలోకెల్లా అతి పెద్దదైన బౌద్ధ స్తూపం ఏళ్లుగా నిరాదరణకు గురవుతోంది. నేలకొండపల్లిలో ఉన్న ఈ క్షేత్రానికి గతంలో దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వచ్చేవారు. కానీ కనీస సౌకర్యాలు లేక క్రమేపీ పర్యాటకుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. దీనికి తోడు సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. అలాగే, క్షేత్రం ఆవరణలో నిర్మిస్తున్న భవనం ఎంతకూ పూర్తికావడం లేదు. ఈనేపథ్యాన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం క్షేత్రాన్ని సందర్శించనున్న నేపథ్యాన అభివృద్ధికి అడుగులు పడతాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

ఆలయాల్లో డీఎఫ్ఓ పూజలు



పూజ చేస్తున్న డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్

ఏన్కూరు: మండలంలోని నాచారం శ్రీ అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయం, గార్లొడ్డులోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ ఆదివారం సందర్శించారు. కుటుంబీకులతో సహా వచ్చిన ఆయన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు స్వాగతం పలికి పూజల అనంతరం ఆయనను సత్కరించారు.

'వైద్యరంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం'



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: వైద్యరంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండడంతో జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. హైదరాబాద్ తర్వాత జిల్లాలోనే అత్యధిక డెంగీ కేసులు నమోదై హైరిస్క్ జోన్ గా ప్రకటించినా మెరుగైన వైద్యసేవలు అందడం లేదని తెలిపారు. ఖమ్మంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆయన పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రా శ్రీకాంత్‌తో కలిసి మాట్లాడారు. జిల్లాలో 300 మందికి డెంగీ నిర్ధారణ కాగా.. అనధికారికంగా వేలల్లో కేసులు ఉన్నాయని చెప్పారు. అయినప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు, సిబ్బంది కొరత తీర్చకపోగా మెరుగైన వైద్యం అందించాలనే ఆలోచన చేయడం లేదని ఆరోపించారు. ఇకనైనా వైద్యసేవలపై దృష్టి సారించడమే కాక పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అలాగే, జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ఊరూరా వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు.

కారు బోల్తా.. ఎస్ఐకి తీవ్ర గాయాలు

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెం వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఘటనలో ఎస్బీ ఎస్ఐ రాంకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మహబూబాబాద్‌లో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన అక్కడి నుంచి ఖమ్మం వైపు కారులో వస్తున్నారు. ఈనేపథ్యాన కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు పల్టీ కొట్టడంతో డ్రైవ్ చేస్తున్న రాంకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను స్థానికులు 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828

పంప్‌హౌస్-2 ట్రయల్‌రన్ సక్సెస్

- మొరాయించిన మూడో పంప్‌హౌస్ మోటార్లు?
- కమలాపురం వద్ద సమీక్ష జరిపి వైరా వెళ్లిన మంత్రులు



పూసుగూడెం పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోశాక కాల్వలో ప్రవహిస్తున్న గోదావరి జలాలు

అశ్వారావుపేట/ములకలపల్లి: ములకలపల్లి మండలం పూసుగూడెం శివారులో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్-2 ట్రయల్‌రన్ విజయవంతమైంది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెలికాప్టర్‌లో నేరుగా ఆదివారం ఉదయం 11 గంటలకు పంప్‌హౌస్-2 వద్దకు చేరుకున్నారు. అంతకుముందే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, నీటిపారుదలశాఖ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు కూడా చేరుకున్నారు. ప్రధాన కాలువలోని నీటి నిల్వలను పరిశీలించి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇతర మంత్రులతో కలసి 11.20 గంటల సమయంలో మోటారు స్విచ్ ఆన్ చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. గోదావరి జలాలను ఎత్తిపోయగా, పూలు జల్లి హర్షం వ్యక్తం చేశారు. కాగా సుమారు ఎనిమిదేళ్లుగా సాగుతున్న సీతారామ ప్రాజెక్ట్ పనులు చివరి అంకానికి చేరుకుంది. మంత్రులు ట్రయల్ రన్ నిర్వహించడంతో గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ దిగువకు పరుగులెత్తింది. గోదావరి జలాలు తొలిసారిగా ములకలపల్లి మండలంలోని పూసుగూడెం పంప్‌హౌస్ నుంచి కమలాపురం పంప్‌హౌస్-3 వైపు సాగడంతో స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. నీటి పారుదలశాఖ ముఖ్య సలహాదారు పెంటారెడ్డి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో మూడో పంపుహౌస్ ట్రయల్‌రన్ వాయిదా?

సీతారామ ఎత్తిపోతల పథకాన్ని ఈ నెల 15న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ములకలపల్లి మండలం పూసుగూడెం పంప్‌హౌస్ వద్ద ప్రారంభించనున్నారు. ఆదివారం పూసుగూడెంవద్ద ఉన్న రెండో పంపుహౌస్ ట్రయల్ రన్ విజయవంతమైంది. అనంతరం మంత్రులు మధ్యాహ్నం 12.30 గంటలకు పూసుగూడెం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి కమలాపురం చేరుకున్నారు. ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించి ఒంటిగంటకు వాయుమార్గంలో వైరాకు బయలుదేరి వెళ్లారు. సమీక్షలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. సాంకేతిక కారణాల నేపథ్యంలో కమలాపురం పంప్‌హౌస్-3 వద్ద ట్రయల్‌రన్ నిర్వహించకుండానే వెనుదిరిగినట్లు సమాచారం. కాగా మోటార్లను సరఫరా చేసింది చైనా కంపెనీ. ఆ కంపెనీ సిబ్బంది మోటార్ల కమిషనింగ్ చేసేందుకు రాలేదని, పంపులు మొరాయించడంతో ట్రయల్ రన్ వాయిదా వేసినట్లు ప్రచారం జరుగుతోంది. పూసుగూడెం పంప్‌హౌస్ వద్ద మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కమలాపురం పంప్ హౌస్ ఈరోజు కాకుంటే రేపు.. మేము కాకుంటే అధికారులు ట్రయల్‌రన్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పథకాన్ని ప్రారంభించేలోగా పంప్‌హౌస్‌ను ట్రయల్ రన్ చేస్తారా? లేదా అనే విషయంలో స్పష్టత లేదు.



రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

రైతులను అనుమతించని పోలీసులు

ముగ్గురు మంత్రుల రాకతో ఎస్పీ రోహిత్‌రాజ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కమలాపురం పంప్‌హౌస్-3 సమీపంలో ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు కరుణాకర్, ఇంద్రసేనారెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు. పంప్‌హౌస్ వద్దకు స్థానిక రైతులను, పలు పార్టీల నాయకులతోపాటు మీడియాను సైతం అనుమతించలేదు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ గొల్ల పెంటయ్య, గొల్ల నారాయణ, కల్తి పాపయ్య సహా రైతులు మాట్లాడుతూ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం తమ భూములను కోల్పోయామని అన్నారు. మంత్రులను కలుస్తామని ఆశతో వస్తే అడ్డుకోవడం సరికాదని వాపోయారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, నాగళ్ల వెంకటేశ్వరరావు, పర్వతనేని అమర్‌నాథ్, గాడి తిరుపతిరెడ్డి, అడపా నాగేశ్వరరావు, బాల అప్పారావు గద్దె రమేశ్, కుంజా రామ్మూర్తిచ గుడ్డూరి నర్సింహారావు తదితరులు ఉన్నారు.

'రాఘవ' ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు సైకిళ్లు

- అన్ని స్కూళ్లలో వాటర్‌ప్లాంట్లు
- విద్యాశాఖ సమీక్షలో మంత్రి పొంగులేటి



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు గ్రామాల నుంచి వచ్చే పేద విద్యార్థులకు రాఘవ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా సైకిళ్లు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. అంతేకాకుండా అన్ని స్కూళ్లలో ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన ఆదివారం ఎంఈఓలు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా పాఠశాలల పరిస్థితి, విద్యార్థుల నమోదు ఫలితాలపై ఆరా తీసిన మంత్రి మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల బలోపేతానికి అందరూ కృషిచేయాలని సూచించారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అందరూ ఉన్నతంగా చదువుకోవాలనేదే లక్ష్యమని తెలిపారు. విద్యారంగానికి నిధుల కొరత లేనందున ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాల నమోదుకు కృషి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ తదితరులు పాల్గొన్నారు.

నా బిడ్డ సూచనతోనే సేవా కార్యక్రమాలు

సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి



ఎమ్మెల్యే రాగమయికి కేక్ తినిపిస్తున్న కుమార్తెలు విపంచి, విరాజి



జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.5 లక్షల చెక్కు ఇస్తున్న రాగమయి దయానంద్

సత్తుపల్లి: భగవంతుడు తన కుమార్తె ఆషాను తీసుకెళ్లినట్లు కుమిలి కుమిలి ఏడ్చినా ఆ బిడ్డ చెప్పిన చివరి మాటే స్ఫూర్తిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని.. ఆమె ఆశీర్వద బలంతోనే పదవి వచ్చిందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి వెల్లడించారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో తన భర్త డాక్టర్ దయానంద్‌తో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మాగమయి మాట్లాడుతూ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు తమ వెంట ఉండి తన గెలుపులో కీలకంగా వ్యవహరించారంటూ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, మంచి చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చి తమ కుటుంబంపై కొందరు చేస్తున్న విమర్శలను అంతా ఖండించాలని కోరారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.25 లక్షలు సంక్షేమ నిధికి ఇస్తామన్న హామీ మేరకు తొలగి విడతగా ఎమ్మెల్యే వేతనం నుంచి రూ.5 లక్షల చెక్కును రాగమయి - దయానంద్ దంపతులు అందజేశారు. మిగిలినవి ఏటా రూ.5లక్షల చొప్పున ఇస్తామని, ఈ నిధులను డిపాజిట్ చేసి వచ్చే వడ్డీతో సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే, కళాకారుల సంక్షేమ నిధికి రూ.2 లక్షలు ఇవ్వగా, ఆరుగురు దివ్యాంగులకు రూ.60వేల విలువైన ట్రైసైకిళ్లను ఎం.డి.కమల్‌పాషా అందించారు. ఆతర్వాత ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు సంఘం ఆధ్వర్యాన పేద మహిళలకు చీరలు, మున్సిపల్ కార్మికులకు నూతన వస్త్రాలు అందజేశారు. అలాగే, పలువురు నోట్‌పుస్తకాలు, పెన్నులు అందజేశారు. మార్కెట్ చైర్మన్లు దోమ ఆనంద్‌బాబు, నీరజాదేవి, నాయకులు చల్లగుళ్ల నర్సింహారావు, గాదె చెన్నారావు, తోట సుజలరాణి, శివవేణు, దూదిపాల రాంబాబు, నారాయణవరపు శ్రీనివాసరావు, అలవాల కరుణాకర్, చల్లారి వెంకటేశ్వరరావు, ఉడతనేని అప్పారావు, పింగళి సామేలు, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

కళారంగానికి వెన్నుదన్నుగా ప్రభుత్వం

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సీనియర్ కళాకారుడు కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న మంత్రి పొంగులేటి



ఇంద్రప్రస్థానం నాటికలోని ఓ సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: కళారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళలా ప్రోత్సహిస్తూ అండగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో మూడు రోజులుగా జరుగుతున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తొలుత తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు అన్నబత్తుల రవీంద్రనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక, సీనియర్ కళాకారుడు కుతుంబాక కృష్ణప్రసాద్‌ను సన్మానించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించడంతో పాటు కళలను ప్రజల్లో తీసుకెళ్లేలా కృషి చేస్తున్న అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ, ఖమ్మం కళాపరిషత్, ప్రజానాట్యమండలి నిర్వాహకులు అభినందనీయులన్నారు. కళాకారులను మరింత ప్రోత్సహించేలా సహచర మంత్రులతో చర్చిస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో మోటమర్రి జగన్మోహన్‌రావు, అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, నాగబత్తిని రవి, వేల్పుల విజేత, మొగిలి శ్రీనివాసరెడ్డి, కురువెళ్ల ప్రవీణ్, బొమ్మా రాజేశ్వరరావు, అన్నబత్తుల పుష్పరాణి, దేవేంద్ర, అర్వపల్లి లక్ష్మీనారాయణ, హరినాథబాబు, నామా లక్ష్మినారాయణ, వేముల సదానందం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటికలు

ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా చివరి రోజు గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారులు ఇంద్రప్రస్థానం, హైదరాబాద్ కళాంజలి కళాకారుల బృందం ఆధ్వర్యాన పాశం నాటికలు ప్రదర్శించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

యాదవుల అభ్యున్నతికి సమష్టి కృషి



మాట్లాడుతున్న కూరాకుల నాగభూషణం, పక్కన నాయకులు

ఇల్లెందు: స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికీ యాదవులు సహా కొన్ని జాతులు, కులాలు అట్టడుగున ఉన్న నేపథ్యాన ఆయా కులాల అభ్యున్నతికి సమష్టి కృషి జరగాలని డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం అన్నారు. ఇల్లెందులో పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యాన ఆదివారం జరిగిన చైతన్య సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన యాదవులకు రాజకీయాలల్లో సముచిత స్థానం లభించటం లేదన్నారు. ఇకనైనా అన్ని పార్టీలు అజెండాల్లో యాదవులకు పదవులు కల్పించేలా ప్రకటించాలని కోరారు. ఇల్లెందులో యాదవులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థానిక నేతలు కృషి చేయాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు నాగా సీతారాములు, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. సమావేశంలో యాదవ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు పగడాల నాగరాజు, మెట్టెల కృష్ణ, పెద్దబోయిన ఉమాశంకర్, మేకల మల్లేశ్‌యాదవ్, సుంకరబోయిన సత్యనారాయణ, బయ్యా వరప్రసాద్, జడల వాణి, రేఖా రవిశంకర్, కోడి రాజేందర్, నాయిని సైదులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న రాము కుటుంబసభ్యులు

చింతకాని: ఇటీవల విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ జల్లి రాము కుటుంబీకులు ఆదివారం చింతకాని సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. నర్సింహాపురానికి చెందిన జల్లి రాము మిషన్ భగీరథలో ఆపరేటర్‌గా, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 5న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య రావడంతో ఆయన మరమ్మతులు చేస్తూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఆయన ప్రాణాపాయ స్థితిలో ఉన్నందున ప్రభుత్వం ఆదుకోవాలనే డిమాండ్‌తో కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేపట్టారు. ఈమేరకు రాము కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియోతో పాటు ఆయన భార్యకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కల్లూరు అప్పయ్య.. బాగుంది!

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం జిల్లాకు చెందిన కళాకారులు రూపొందించిన కల్లూరు అప్పయ్య చిత్రం ట్రైలర్ బాగుందని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ అన్నారు. హైదరాబాద్‌లో శనివారం రాత్రి ఆయన సినిమా ట్రైలర్, పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. దర్శకుడు కొత్తపల్లి శేషు చిత్రాన్ని ఆసక్తిగా రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా తెలిసిపోతుందని చెప్పారు. ఈకార్యక్రమంలో దర్శకుడితో పాటు నటీనటులు, సాంకేతిక నిపుణులు మొగిలి గుణకర్, కిషోర్‌బాబు, అన్నపూర్ణ, రవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హరికృష్ణ, తదితరులు



నగదు అందిస్తున్న యూనియన్ నాయకులు

ఎలక్ట్రీషియన్‌కు ఆర్థికసాయం

పెనుబల్లి: హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న పెనుబల్లికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ షేక్ లతీఫ్‌కు సప్తపది లయన్స్ క్లబ్ బాధ్యులు అండగా నిలిచారు. ఈ మేరకు ఆదివారం ఆయనకు రూ.20 వేల ఆర్థికసాయం అందించారు. అలాగే, ఎలక్ట్రీషియన్ల యూనియన్ తరఫున అధ్యక్షుడు, కోశాధికారి యూసుఫ్, శ్రీనివాసాచార్యులు మరో రూ.27 వేలు అందజేశారు.

హైవే పనులను అడ్డుకున్న గ్రామస్తులు



కంపెనీ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగిన స్థానికులు

నేలకొండపల్లి: కోదాడ-ఖమ్మం జాతీయ రహదారి నిర్మాణ పనులను మండలంలోని పైనంపల్లి వద్ద గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామంలో సైడ్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టలేదని, గ్రామంలోకి రాకపోకలు సాగించేలా పనులు చేయలేదని ఆరోపిస్తూ ఆదివారం వారు నిరసన తెలిపారు. ఖమ్మం-కోదాడ రహదారిపై రాస్తారోకో నిర్వహించగా కంపెనీ ప్రతినిధులు చేరుకుని చర్చించారు. నేషనల్ హైవే అధికారులు రావాలిసిందేనని చెప్పడంతో త్వరలో సమస్యలు పరిష్కరిస్తామన్న ప్రతినిధుల హామీతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కె.సామేల్, యడవల్లి నాగరాజు, షేక్ హుస్సేన్, గోవర్ధన్, కుక్కల ఇస్సాక్, యడవల్లి తిరపయ్య, ఉమాచారి, కోడి రామనర్సయ్య, యడవల్లి రాంబాబు, ఆవుల రామయ్య, రామాచారి, కొత్త భద్రయ్య, కుక్కల పుల్లయ్య, గునగంటి వీరబాబు, మారగాని మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానికి కొత్త బోటు...

- నేడు ప్రారంభించనున్న మంత్రి
- పాత బోటుపైనా దృష్టి సారించాలని విన్నపాలు



కొత్త బోటును సిద్ధం చేస్తున్న సిబ్బంది

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్‌లో పర్యాటకుల సౌకర్యార్థం మరో బోటు అందుబాటులోకి రానుంది. ఇప్పటికే 50 మంది సామర్థ్యం కలిగిన పెద్దబోటుతో పాటు నలుగురు ప్రయాణించే చిన్న స్పీడ్‌బోట్ ఉన్నాయి. అయితే, పర్యాటకుల రద్దీ దృష్ట్యా 20 మంది సామర్థ్యం కలిగిన మరో బోట్‌ను టూరిజం డెవలప్‌మెంట్ శాఖ అధికారులు కేటాయించారు. ఈ బోట్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం ప్రారంభించనున్నారు. కాగా, కిన్నెరసానికి సోమవారం మంత్రులు రానున్న నేపథ్యాన పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్‌కుమార్, ఎస్సై సురేష్ ఆదివారం బోటింగ్ పాయింట్, అద్దాల మేడ, కాటేజీల ప్రాంతాల్లో తనిఖీ నిర్వహించి బందోబస్తుపై చర్చించారు.

'బాహుబలి'పై నిర్లక్ష్యం

ఎనిమిదేళ్ల కిందట రూ.లక్షల వ్యయంతో తీసుకొచ్చిన బాహుబలి బోటు నిర్లక్ష్యానికి గురైంది. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యాన పుణే నుంచి రూ.40 లక్షల వ్యయంతో వంద మంది సీటింగ్ సామర్థ్యం కలిగిన బోటును 2015లో కిన్నెరసానికి తెప్పించారు. అయితే, రిజర్వాయర్‌లో తిప్పకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో అది పనికిరాకుండా పోయింది. ఫైబర్‌షీట్లు లేచిపోయి రాడ్లు పైకి తేలాయి. ఈ బోటును సైతం అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై టూరిజం డెవలప్‌మెంట్ శాఖ మేనేజర్ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా.. పర్యాటకుల రద్దీ దృష్ట్యా కొత్త బోటును స్టాండ్ బైగా తీసుకొస్తున్నామని తెలిపారు. అయితే, బాహుబలి బోటు వచ్చినప్పుడు తాను లేనని.. ఆ వివరాలు పూర్తిగా తెలియవని చెప్పారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ భానుప్రకాశ్

ఖమ్మంఅర్బన్: మద్యానికి బానిసై డబ్బు కోసం గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని ఖానాపురం హవేలీ(ఖమ్మం అర్బన్) పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి వివరాలను సీఐ భానుప్రకాశ్ ఆదివారం వెల్లడించారు. ఖమ్మం 1వ డివిజన్ ఖైకొండాయిగూడెంకు చెందిన గద్దల రాకేశ్, రాజీవ్‌నగర్ గుట్టకు చెందిన చల్లా గోపి, యూపీహెచ్ కాలనీకి చెందిన పులి ధనుష్ మద్యానికి అలవాటు పడి డబ్బు కోసం గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఏపీలోని పలు ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా మార్చి ఖమ్మంలో అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఈమేరకు ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యాన ఎస్సై అలీం హుస్సేన్ ఖైకొండాయిగూడెంలో తనిఖీలు చేపట్టగా ముగ్గురు పట్టుబడడంతో 430 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రఘునాథపాలెం: మండలంలోని ఈర్లపుడి శివార్లలో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఈసందర్భంగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని రూ.1,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: వేడినీటి కోసం హీటర్ ఆన్ చేసే క్రమాన ఓ వ్యక్తి షాక్ గురై మృతి చెందాడు. ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతంలో దోనేపూడి మహేష్‌బాబు(40) కొబ్బరికాయల వ్యాపారం చేస్తున్నాడు. ఆయన ఆదివారం ఉదయం నీరు వేడి చేసేందుకు వాటర్ హీటర్ ఆన్ చేస్తూ షాక్‌కు గురయ్యాడు. పక్కనే ఉన్న ఆయన తొమ్మిదేళ్ల కుమార్తె భయంతో కేకలు వేస్తూ బయటకు వచ్చి తల్లికి చెప్పగా వారు మహేష్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందాడని వైద్యులు వెల్లడించారు. ఆయనకు భార్య దుర్గాదేవి, ఇద్దరు కుమార్తెలు ఉండగా ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ తెలిపారు.